www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 21 మార్చి 2023
5
అన్నమయ్య



అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

- ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి

రాయచోటి: జిల్లాలో వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ధనలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ జిల్లాలో వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్వాడి కార్యకర్తలు 23, సహాయకులు 80, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నియామకపు ప్రక్రియ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోస్టుల ఖాళీల వివరాలు, అర్హత ప్రామాణికాలు, నిర్ణీత దరఖాస్తు ఫారంను ఐసిడిఎస్ కార్యాలయంలో పొందవచ్చన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమగు ధృవీకరణ పత్రాల నకలులతో సంబంధిత శిశు అభివృద్ధి పథక అధికారి వారి కార్యాలయములో ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఇచ్చి తగు రశీదును పొందాలని తెలిపారు. ఈ ప్రకటనను ఎటువంటి కారణములు లేకనే రద్దు పరచుటకుగాని, వాయిదా వేయుటకు గాని కలెక్టర్, జిల్లా స్థాయి ఎంపిక కమిటీకి సర్వహక్కులు ఉన్నాయన్నారు.

అంగన్వాడీలను అడ్డుకోవడం సరికాదు : సిఐటియు



ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు


ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో విజయవాడ మహా ధర్నా కార్యక్రమానికి వెళుతున్న అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం, దురుసుగా ప్రవర్తించడం సరికాదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ తెలిపారు. ప్రభుత్వం చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకున్నందుకు నిరసనగా సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఐసిడిఎస్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ముఖ హాజరు రద్దు చేయాలన్నారు. పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని పేర్కొన్నారు. గ్యాస్ బండ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సూపర్వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి ఏబదేళ్లకు పెంచాలన్నారు. ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని పేర్కొన్నారు. 300 జనాభా దాటిన మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా గుర్తించాలన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని పంపిణీ చేయాలని, అంగన్వాడీలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని పేర్కొన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించి భీమా అమలు చేయాలని పేర్కొన్నారు. ర్యాలీలు, సభలను నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెంబర్ ఒకటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు శిరీష, అన్నపూర్ణమ్మ, షకీలాభాను, రాజేశ్వరి, వనిత, సునీత, లావణ్య, మమత, అనురాధ, ఈశ్వరమ్మ, విజయమ్మ, అమరావతి పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పందన, ఎలక్షన్స్ 6బి కలెక్షన్స్, గ్రామ, వార్డు సచివాలయం సర్వీసెస్, హౌసింగ్ తదితర అంశాలపై ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, డిఎల్‌డిఒలు, ఎంపిడిఒలు, ఎపిఒలు, ఎపిఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డు, బియ్యం కార్డు, పెన్షన్ కానుక ప్రభుత్వ ప్రధాన పథకాలు ఎట్టి పరిస్థితుల్లోనూ గడువులోపే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. హౌస్ సైట్ అప్లికేషన్లు బియాండ్ ఎస్‌ఎల్‌ఎలో ఉన్నాయని, తహశీల్దార్లు, ఆర్‌డిల లాగిన్ ల్లో త్వరగా క్లియర్ చేయాలి అన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ సర్వే 97 శాతం చేశారని, మిగిలిన 3 శాతం పూర్తి చేయాలన్నారు. అప్డేషన్ ఆధార్, ఆయుష్మాన్ భారత్‌ల్లో పురోగతి కనిపించాలన్నారు. జిల్లాలో 148 గ్రామ, వార్డు సచివాలయ వాలంటరీ ఖాళీలు ఉన్నాయని నోటిఫికేషన్ విడుదల చేస్తున్నామని, నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకం కింద జగనన్న కాలనీలలో ప్రతి రోజు ఇచ్చిన లక్ష్యాన్ని గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు అధిగమించాలని చెప్పారు. ఆర్‌సి నుంచి ఆర్‌ఎల్ నుంచి పూర్తి దశకు ఇల్ల నిర్మాణం చేరుకోవాలన్నారు. ఎంపిడిఒలు భాగస్వామ్యం అయి ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎండ తీవ్రత, వడగాల్పుల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ చలివేంద్రాలు, చలవ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలంలో రెండు, మూడు చోట్ల పెద్ద హోర్డింగ్‌లు కనపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో తాగునీటి సమస్య పైన తహశీల్దార్లు పర్యవేక్షణ చేయాలన్నారు. సమీక్షలో డిఆర్‌డిఒ సత్యనారాయణ, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, రాయచోటి, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, డిఎల్ డిఒలు, ఎంపిడిఒలు, ఎపిఒలు, ఎంపిఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలి : గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

ఎండ తీవ్రత, వడగాల్పుల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌లో వడగాల్పులు, ఎండ తీవ్రతపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వివిధ శాఖలు క్షేత్రస్థాయిలో చలివేంద్రాల ద్వారా తాగు నీరు, ప్రాథమిక చికిత్స వంటి చర్యలను సత్వరం అమలు పర్చాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో వడగాల్పులు, ఎండ తీవ్రత పరిరక్షణకు ముఖ్య కూడలి ప్రదేశాల్లో చలువ పందిళ్ళు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మున్సిపాలిటీ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. మార్చి నుంచి జూన్ వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటున్న నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. కార్మికులు, కూలీలు అధికంగా పనిచేస్తున్న ప్రదేశాలలో తగు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు, ఉపాధి కూలీలు పని చేసే ప్రాంతాల్లో ఒఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ చేయాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. ఆర్టీసీ బస్సుల్లో కూడా వాటర్ క్యాన్‌లు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను సూచించారు. అన్ని పాఠశాలల్లో వాటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వడ గాల్పులపై ఎన్‌జిఒలు, కమ్యూనిటి గ్రూప్స్, ఎంప్లాయిస్ అసోసియేషన్‌లు అవగాహన కల్పించాలన్నారు. పట్టణ, మండల కేంద్రాలలో చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వడగాలులు, వడదెబ్బపై పాంప్లెట్స్ ముద్రించాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డిఒ, మండల, సచివాలయం స్థాయిల్లో వడగాల్పులు, ఎండ తీవ్రతపై సమావేశం నిర్వహించాలని సూచించారు. సమీక్షలో డిఆర్‌ఒ సత్యనారాయణ, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, రాయచోటి, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

వెలుగు విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వెలుగులో పనిచేస్తున్న విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని వెలుగు విఒఎలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ మిత్రులకు ప్రభుత్వం మూడు సంవత్సారాలు కాలపరిమితి నిర్ణయించడం సరైంది కాదన్నారు. బకాయివేతనాలు చెల్లించాలని తెలిపారు. 65 సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 45 ఏళ్ల పూర్తిచేసుకున్న వారిని తొలగించాలనుకోవడాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సంఘాలు మెర్జింగ్ వలన చాలా మంది ఉపాధి కోల్పోతారని దీన్ని సిఐటియు ఖండిస్తున్నదని పేర్కొన్నారు. సంఘ మిత్ర జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణమ్మ, పరంజ్యోతి, రెడ్డెప్ప మాట్లడుతూ జెండర్ వయసు చదువుల పేరుతో క్రమంగా యానిమేటర్ వ్యవస్థ లేకుండా చేయాలనీ చేస్తున్నాదన్నారు. ఉద్యోగ భద్రత కోసం ఉధృత పోరాటాలు చేయాల్సిన అవసరం వుందన్నారు. కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్, రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ ఇవ్వలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతపత్రాన్ని డిఆర్ఒ సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్, రమణారెడ్డి, రాణి, సుబ్రమణ్యం, చంద్రకళ, ప్రభాకర్, నారాయణ, ఓబులేసు, జిల్లా నలుమూలల సంఘ మిత్రలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న విఒఎలు

'శ్రీ చైతన్య'ఆగడాలను అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

శ్రీ చైతన్య పాఠశాల ఆగడాలు అరికట్టి గుర్తింపును రద్దు చేయాలని సోమవారం రాయచోటి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి డిఆర్ఒ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆగడాల అడ్డుకట్ట వేయాలని విద్యా సంస్థలం పూర్తికాకముందే 2023– 24 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల కళ్లకు గంతులు కట్టి మోసానికి తెరలేపారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు మానిటరింగ్ కమిటీ వేసినప్పటికీ దాన్ని జిల్లా విద్యాశాఖ అధికారులు అమలు చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలు మితిమీరి వ్యవహరిస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం దారుణం అన్నారు. తక్షణమే కార్పొరేట్ శ్రీ చైతన్య విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని, పరిమితికి మించి తరగతి గదిలో విద్యార్థులను చేర్పించడం, కనీసం ఏ ఒక చైతన్య స్కూలుకు ప్లేగ్రౌండ్ కానీ, కనీసం బాత్‌రూములు, తాగునీటి సౌకర్యం ఎక్కడా లేవని వాపోయారు. ఫంక్షన్ల పేరుతో విద్యార్థుల నుంచి అదనపు రుసుం వసూలు చేస్తున్నారని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, అఖిల్, మనోజ్, హరి, శివ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిసిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానతో అన్నదాతలు తీవ్రంగా నష్ట పోయారని బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బోడెం రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఈ అంశంపై స్థానిక నీరుగట్టువారిపల్లెలోని బిసిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలపై పంట నష్టం సర్వే నివేదికలు ప్రభుత్వం ఇప్పటి వరకు తీసుకోవడం జరుగలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఆక్షేపించారు. వడగండ్లు, అకాల వర్షాల వలన దెబ్బ తిన్న రైతులకు న్యాయం చేసే విధంగా, క్షేత్రస్థాయి పరిశీలనలో వెంటనే ప్రభుత్వం అంచనాలు తయారు చేసి, బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బిసి సామాజిక వర్గం వడ్డెర కులానికి చెందిన డిఎస్‌పి వేణుగోపాల్‌పై వెంటనే విఆర్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులపెద్దలు ఏర్పాటు చేసిన సమావేశానికి డిఎస్‌పిని పిలవడం జరిగిందని, దీనికి రాజకీయాలు జోడించి అతన్ని విఆర్‌లో పెట్టడంపై అభ్యంతరం తెలిపారు. బిసి ఓట్లు కావాలి, అదే బిసిలు వారి కుల పెద్దలతో కలవకూడదా, ఇది సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే డిఎస్‌పిని విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో నేరుగా డిజిపి, ముఖ్యమంత్రిని కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిసిహెచ్‌పిఎస్ నాయకులు చంద్రయ్య, రామ లింగయ్య, బండి రామచంద్ర, సుబ్రమణ్యం, రమణ, శ్రీనివాసులు, రఘునాథ్, రఘు, సుబ్బయ్య, గురుమూర్తి, వేణు గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా 'శ్రీ భువన' వార్షికోత్సవం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు శ్రీభువన విద్యాలయం వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక తిరుపతి రోడ్డులోని ఎంఎన్‌ఆర్ గార్డెన్స్‌లో సోమవారం శ్రీ భువన విద్యాలయం 14వ వార్షికోత్సవ కార్యక్రమం సందర్భంగా సంస్థ నిర్వాహకులు ఉమారమాదేవి, ప్రిన్సిపల్ గుణలక్ష్మి మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లల మనుగడకు, అభివృద్ధి, ఉజ్వల భవితకు విద్య ఒక్కటే కాదని తెలిపారు. వారి మానసిక, శారీరక వికాసానికి, ఆరోగ్యకర శరీరానికి దోహదపడే నైపుణ్యాలు కూడా విద్యార్థులకు అవసరమని తెలిపారు. వారి వికాసానికి అన్ని విధాల తమ సంస్థ తోడ్పాటు అందిస్తోందని చెప్పారు. తమ సంస్థ వారి కోసం కృషి చేస్తోందని చెప్పడానికి విద్యార్థులు సాధిస్తోన్న ఉత్తమ ఫలితాలే అందుకు ఓ నిదర్శనమని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన చోటా భీమ్, మోటు–పత్లు, ఫోన్ మ్యాన్యా, ఏ లెసన్ ఫర్ హ్యూమన్ బీయింగ్స్ నాటికలు, పుణ్యభూమి నాదేశం నమో నమామి వంటి సందేశాత్మక, జానపద, భక్తి పాటలకు చక్కటి నృత్యాలు చేస్తూ ఆహుతులను ఆకట్టుకున్నారు.



మోటు పతులు నాటికలో విద్యార్థులు

ప్రజల్లో నమ్మకం కల్గించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను ప్రజల్లో బలమైన నమ్మకాన్ని కలిగేలా ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని జిల్లా అధికారులను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో కలెక్టర్, డిఆర్ఒ సత్యనారాయణ, భూముల సర్వే విభాగం సహాయ సంచాలకులు జయరాజ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయా శాఖల్లో తమ కింది స్థాయి అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిశీలించి బియాండ్ ఎస్ఎల్ఎలోకి ఏ ఒక్క అర్జీ వెళ్లకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గడువు దాటి ఒక్క సమస్య కూడా ఉండకూడదన్నారు. అధికారులందరూ బాధ్యతతో స్పందన సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిష్కారం గురించి అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పూర్తి వివరాలతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు వినతి పత్రాలు సమర్పించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

హత్య కేసులో ముద్దాయిలకు జీవిత ఖైదు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నాలుగేళ్ల కిందట హత్య కేసులో నిందితులైన తండ్రి, కుమారులకు రూ.వెయ్యి జరిమానాతో పాటు జీవిత ఖైదును విధిస్తూ సోమవారం మూడవ అదనపు జిల్లా జడ్జి ఆర్‌వివిఎస్.మురళీకృష్ణ తీర్పునిచ్చారు. 2019వ సంవత్సరంలో పట్టణంలోని చిన్న చావిడి వీధిలో నీటి మోటార్ కోసం ఇరు కుటుంబాల మధ్యన ఘర్షణ నెలకొని పబ్బతి బాలాజీ అనే వ్యక్తిని తండ్రి, కుమారులైన మేడా శ్రీహరి రావు, రఘు కుమార్ కత్తితో దాడి చేసి బాలాజీని హత్య చేశారు. ఆ సమయంలో అర్బన్ సిఐగా విధులు నిర్వహిస్తున్న శుభ కుమార్ ఈ కేసుపై పూర్తి విచారణ చేసి కోర్టుకు నివేదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి జీవిత ఖైదును విధిస్తూ సోమవారం తీర్పును వెల్లడించారు.

అధికారం శాశ్వతం కాదు : టిడిపి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదని అహంకారంతో అధికార మదంతో ఆలయం లాంటి అసెంబ్లీలో వైసిపి ఎమ్మెల్యేలు టిడిపి ఎమ్మెల్యేలపై దాడి చేయడం దుర్మార్గపు చర్య అని రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఓట్లు వేసింది గుండాయిజం రౌడీయిజం చేయడానికి కాదని వైసిపి ఎమ్మెల్యేలు గుర్తించుకోవాలన్నారు. జీవో నెంబర్ వన్‌పై చర్చకు పట్టుబడితే సమాధానం చెప్పలేక దళిత ఎమ్మెల్యే అయిన బాల వీరాంజనేయ స్వామిపై సంతనూతలపాడు చింతలపూడి వైసిపి ఎమ్మెల్యేలు దాడికి దిగారన్నారు. బుచ్చయ్య చౌదరిపైనా మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ దాడికి పాల్పడ్డారన్నారు. సభలో ఇంత జరుగుతున్నా కూడా స్పీకర్ ఏమీ మాట్లాడకుండా ఉండటం శోచనీయమని వాపోయారు. రాష్ట్రానికి చీకటి రోజు భారతదేశం తలదించుకునే పరిస్థితి అసెంబ్లీలో జరిగిందన్నారు తెలిపారు. జరిగిన దారుణంపై స్పీకర్ వైసిపి ఎమ్మెల్యేలపై సుమోటోగా కేసులు పెట్టించి వారిని వెంటనే అరెస్టు చేయించాలన్నారు. చట్టసభల్లో టిడిపి ఎమె మ్మెల్యేలపై ఇలాంటి భౌతిక దాడులకు దిగడం అప్రజా స్వామికమన్నారు. అసెంబ్లీని సక్రమంగా నడిపించడంలో అధికారపక్షం పూర్తిగా విఫలమైందన్నారు. ఇలాంటి సిగ్గులేని వైసిపి ఎమ్మెల్యేలకు ప్రజలు తొందర లోనే గుణపాఠం చెప్తారన్నారు. సమావేశంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి నూలివీడు శివారెడ్డి, రాయచోటి రూరల్ అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి విష్ణువర్ధన్ రెడ్డి రాజంపేట పార్ల మెంటరీ అధికార ప్రతినిధి హరి, అమర్నాథ్ రెడ్డి, సంబేపల్లి క్లస్టర్ ఇన్‌ఛార్జి సత్యరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి దేవగోపాల్ నాయుడు, టిడిపి నాయకులు రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖాదర్‌బాషా



మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి

'పోషన్ పఖ్వాడా'పై అవగాహన

ప్రజాశక్తి - రాయచోటి

ఈ నెల 20 నుంచి ఏప్రిల్ వరకు పోషన్ పఖ్వాడాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలో అధికారులకు ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పోషన్ పఖ్వాడా రోజువారి కార్యక్రమాలను సంబంధిత శాఖల అధికారులు అందరూ కలిసి విజయవంతం చేయాలని సూచించారు. రెగ్యులర్ మీటింగ్‌తో పాటు పోషన్ పఖ్వాడా కార్యక్రమంలో పంచాయతీరాజ్, డిఆర్‌డిఎ, అగ్రికల్చర్, స్కూల్ ఎడ్యుకేషన్, హార్టికల్చర్, డిఎంహెచ్ఒ, మున్సిపల్, వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్లు, జిల్లా స్థాయి నుంచి సచివాలయం స్థాయి వరకు భాగస్వామ్యం కావాలన్నారు. పోషన్ పఖ్వాడా కార్యక్రమంలో చేసినవన్నీ ఏ రోజుకు ఆ రోజు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. ఐసిడిఎస్, డిఆర్‌డిఎ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో లబ్ధిదారులుగా ఉన్న ఆరేళ్లలోపు పిల్లల ఎత్తు, బరువు కొలత, ఆరోగ్యకరమైన పిల్లలను గుర్తింపు, టెస్ట్, ట్రీట్, టాక్ అనీమియా, ఆరోగ్యకరమైన తల్లి బిడ్డ కోసం సంప్రదాయ ఆహారాన్ని ప్రోత్సహించలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

721 మంది విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతోందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం మ్యాథ్స్, బాటనీ, సివిక్స్ పేపర్–1, పరీక్ష నిర్వహించామన్నారు. మ్యాథ్స్, బాటనీ, సివిక్స్ పేపర్–1, పరీక్షకు మొత్తం 15,659 మంది విద్యార్థులకు గాను14,930 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. ఇందులో 8 మంది మాల్ ప్రాక్టీస్, 721 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థిని, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించామని తెలిపారు. మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఏ ఇతర ఎలక్రానిక్ వస్తువులను అనుమతించలేదన్నారు.



దాతల నుంచి బంగారు పతకాన్ని అందుకుంటున్న విద్యార్థి నందిని

ఎస్ఎస్‌సి ర్యాంకర్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి-పీలేరు

2021–22 విద్యా సంవత్సరం జరిగిన ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల్లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థికి దాత బంగారు పతకాన్ని బహుకరించారు. పీలేరు పట్టణ అయ్యప్పరెడ్డి కాలనీ, జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వి.నందిని అనే విద్యార్థిని 600/518 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించింది. పాఠశాల 59వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆ పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ తన సొంత ఖర్చులతో ప్రొఫెసర్లు అయిన తన కుమార్తె స్వర్ణలత, అల్లుడు హరిబాబు చేతుల మీదుగా రెండు గ్రాముల బంగారు పతకం నందినికి బహూకరించారు. ఈ సందర్భంగా జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.జయమ్మ మాట్లాడుతూ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ ఈ పాఠశాలలో ఎక్కువ కాలం పనిచేసి, పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థినికి గోల్డ్ మెడల్ బహుకరించడం ఆనవాయితీగా పెట్టుకున్నారన్నారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం కూడా పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి విద్యార్తులు బంగారు పతకం పొందాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థిని వి.నందిని, విద్యార్థిని తల్లిదండ్రులు, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎపి ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌ను కలిసిన కరీముల్లా

మదనపల్లె అర్బన్: అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా సోమవారం అనంతపురంలో ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. జిల్లా రాష్ట్రంలోనే అత్యధికంగా ఉర్దూ మాట్లాడే ముస్లిం మైనారిటీలు నివసిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎక్కువ ఉర్దూ స్కూల్స్, హైస్కూల్స్, కాలేజీలు ఈ ప్రాంతాల్లో ఉన్నాయని, అలాంటి ఈ ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉర్దూ లైబ్రరీలు మరియు కంప్యూటర్ సెంటర్స్ ఏర్పాటు చేసి ఉర్దూ భాషను అభివృద్ధి చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే మరిన్ని ఉర్దూ లైబ్రరీలు, కంప్యూటర్ సెంటర్లను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డిఒ లక్ష్మీపతి

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గ్రామ సచివాలయాల నుంచి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని మదనపల్లి డివిఎల్‌డిఒ లక్ష్మీపతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని సామకోటవారిపల్లి, అగ్రహారం గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపిడిఒ లీలా మాధవి, సర్పంచు మహదేవ రెడ్డి సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను డివిఎల్‌డిఒకు వివరించారు. ఉద్యోగుల హాజరు పట్టికను, పలు రికార్డులను, మూమెంట్ రిజిస్టర్ లను, ప్రభుత్వ పథకాల అర్హుల, అనర్హుల జాబితాలను పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న పలు సర్వేల అంశాలపై ఆరా తీశారు. గ్రామ సచివాలయాల్లో అన్ని శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉన్నారని, సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు మహదేవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నాగమల్లి, మంజుల, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు వీలుగా బస్సులు నడపాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రయాణికులకు వీలుగా ఉండే ఉదయం సమయంలో బస్సు సర్వీసును నడిపేలా చూడాలని కోరుతూ గిరిజన సంఘ నాయకుడు అమ్మనాయక్ సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ గిరీషకు కలసి వినతి పత్రాన్ని అందజేశారు. రాయచోటి నుంచి సుండుపల్లె మీదుగా ఆరోగ్య పురంతండాకు వెళ్లే బస్సు సర్వీసు వేసవి మార్చి అందరికీ వీలుగా ఉండేలా చూడాలని కోరారు. ఉదయం ఐదు గంటలకు ఆరోగ్యపురం నుంచి రాయచోటికి వెళ్లే బస్సు సర్వీసులు తొలగించారని అన్నారు. రాత్రిపూట తొమ్మిది గంటలకు రాయచోటి నుంచి ఆరోగ్యపురం వెళ్లే బస్సు సర్వీసును తొలగించడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందన్నారు. పరీక్ష సమయం మారుమూల గ్రామాల మీదుగా వెళ్లే బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని కోరారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గణితంలో జ్ఞానదీప్తి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని జ్ఞానదీప్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు విశ్వం ఎడ్యుకేషన్ స్కూల్ ల్యాబ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం కడపలో బాలవికాస్ పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయిలో అబాకస్, వేదిక్ మ్యాథ్ మ్యాట్రిక్స్ పోటీలలో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆర్లంక జానకిరామ్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మమ్మ మాట్లాడుతూ స్టార్ జూనియర్స్ విభాగంలో ఎం.శ్రేజ రెండవ బహుమతి, జూనియర్స్ విభాగంలో షేక్ రుఖయా రెండో బహుమతి, సీనియర్స్ విభాగంలో షేక్ ఫైజా రెండవ బహుమతి, సీనియర్స్ విభాగంలో షేక్ ఫైజా రెండవ బహుమతి అందుకున్నారని తెలిపారు. వేదిక్ మ్యాథ్ మ్యాట్రిక్స్ లో పి.భవన రెండో బహుమతి అందుకున్నారన్నారు. ఉపాధ్యాయులు కెపి. రమణ, బి.వినయ్ కుమార్, పద్మావతి, లావణ్య, లు విజేతలను అభినందించారు.

దళిత ఎమ్మెల్యేపై దాడి అమానుషం

ప్రజాశక్తి-నందలూరు

సొక్కత్వ అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయ స్వామిపై దాడి అమానుషమని టిడిపి బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజులు తీవ్రంగా ఖండించారు. సోమవారం స్థానిక శ్రీఅన్నమాచార్య జూనియర్ మీడియం హైస్కూల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటి నుంచి వైసిపి నాయకులు గుండా దౌర్జన్య పాలనకు ఇదొక తార్కాణమని, భవిష్యత్తులో వీటన్నింటికీ మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మాడపూరి హేమలత, తోట శివశంకర్, సమ్మెట ఉమామహేష్, కొండిశెట్టి సుదర్శన్, సయ్యద్ అమీర్ భాష, కల్లూరు సుబ్బరాయుడు, గుర్రంకొండ రామయ్య, జగదీ వెంకటరమణ పాల్గొన్నారు.

'పోషన్ పఖ్వాడా'పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషన్ పఖ్వాడాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిడిపిఒ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక విశ్వభారతి హైస్కూల్ నందు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిడిపిఒ మాట్లాడుతూ ప్రజల్లో పోషకాలను పెంపొందించుకుని ప్రజలు చిరుధాన్యాలను వాడాలన్నారు. చిరుధాన్యాల వల్ల ఆరోగ్యంగా ఉంటారని ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలపైనే అవగాహన పెంచుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం పిల్లలకు పెట్టాలన్నారు. పోషణ పఖ్వాడ కార్యక్రమానికి వైద్య ఆరోగ్య, అంగన్వాడీ, పంచాయతీ సెక్రెటరీ, మహిళా పోలీసులు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల ప్రజలకు అవగాహన కల్పించి చిరుధాన్యాలు వినియోగించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని పోషణ్ పక్వాడ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సిడిపిఒ నాగాదేవి మాట్లాడుతూ [illegible] ఈనెల 20వ నుంచి ఏప్రిల్ మూడో తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాజెక్టు స్థాయి, జిల్లా స్థాయిలో నిర్వహించ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్వేత, అంగన్వాడీ కార్యకర్తలు ఉమాదేవి, సరస్వతి కళావతి ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

లీగల్ నోటీసు

టూ...
సుద్దపల్లె గంగులప్ప W/o దాసయ్య,హరిజనవాడ, ఎగువ సిద్ధపల్లె గ్రామం, రామాపురం మండలం, అన్నమయ్య జిల్లా.
[illegible]

షెడ్యూల్
[illegible]

పి. రెడ్డయ్య, ఎం.ఏ.,ఎల్.ఎల్.బి.,
అడ్వకేట్,
రాయచోటి - 516 269.

క్షయ రహిత సమాజానికి సహకరించండి

ప్రజాశక్తి-కలికిరి

క్షయ రహిత సమాజానికి అధికారులు, దాతలు సహకరించాలని జడ్‌పిటిసి పద్మజ, లోకవర్ధన్ పిలుపునిచ్చారు. సోమవారం మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, సిబ్బంది తమ పరిధిలో ఉన్న పది మంది క్షయ వ్యాధిగ్రస్తుల దత్తత కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీపద్మావతి హెల్త్ అండ్ సర్వీస్ సొసైటీ వారు పది మంది రోగులకు ఆరు నెలల పాటు పౌష్టికాహారం అందిస్తామన్నారు. రోగులకు పిహెచ్‌సిలో పౌష్టికాహారం కలిగిన బాగ్స్ అందించారు. ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ పోషణ మిత్ర కార్యక్రమంలో భాగంగా, వైద్యాధికారులు డాక్టర్ చిన్న రెడ్డెప్ప, డాక్టర్ బి. కావ్య గంధ ఆధ్వర్యంలో 24 మంది టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను అందించారు. వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలపాటు ఉచితంగా పౌష్టికాహారాన్ని అందజేయడం అభినందనీయని అన్నారు. క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు పొందాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఇందిరాదేవి, ఎంపిహెచ్ ఎస్ హేమలత, టిబి యూనిట్ వైద్య సిబ్బంది ఎంపిహెచ్‌ఎస్ మురళి, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ వై.నాగిరెడ్డి, స్టాఫ్ నర్స్ ప్రమీల కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ సందీప్, శ్యామల, రిజ్వాన, క్రిష్ణకుమారి, నాగవేణి, చందూ ప్రియా, భానుప్రియ, షహీదా, గీత, నాగరాణి, సాహెరా భాను, పాల్గొన్నారు.



క్షయ వ్యాధిగ్రస్తులకు సూచనలు చేస్తున్న వైద్యులు

నోటి కేన్సర్‌ను అరికట్టాలి



నోటి కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రంలోని మహల్ సిహెచ్‌సి వైద్యశాలలో డాక్టర్ ఇ.పుష్పకుమారి, డాక్టర్ కిషోర్ కుమార్ వైద్య అధికారులు మహిజ, బీతాజ్, సుభాషినిల ఆధ్వర్యంలో ప్రపంచ ఓరల్ హెల్త్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు, గుట్కా పాన్ పరాగ్ లాంటి వాటిని నమలడం వలన కొంతమంది నోటి కేన్సర్‌కు గురి అవుతున్నారని అన్నారు. అంతే కాకుండా ప్రజలు తీసుకునే రకరకాల ఆహార పదార్థాలను తినేటప్పుడు కొన్ని చిన్న చిన్న ముక్కలు పంటి సన్నల్లో నిలిచిపోవడం వలన చిగుర్లు వాపు రావడం తద్వారా పంటి నొప్పులు రావడం, చిగుర్లలో అక్కడక్కడ రక్తం రావడం లాంటి సమస్యలు వస్తూ ఉంటాయని అన్నారు. ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు వారు వెంటనే దగ్గర్లో ఉన్న పంటికి సంబంధించిన వైద్యుల దగ్గరకు వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. పంటి సమస్యలు రాకుండా ఉండడానికి ప్రజలు ఆరో గార్డ్ అనే లిక్విడ్ ను నోటిలో వేసుకొని బ్రష్‌తో బాగా పళ్ళను ఉదయం సాయంత్రం వేళల్లో శుభ్రం చేసుకుని నోటి కేన్సర్‌ను అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో కలికిరి, కలకడ, మేడికుర్తి, ఎర్రగడ్డ ఎర్రకోట పల్లి, పిహెచ్‌సిల వైద్య అధికారులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మల్లయ్య కొండకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



పంచలోహ కాశీ ఢమరుకం సమర్పణ

తంబళ్లపల్లి సమీపంలోని మల్లయ్య కొండపై ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వందలాదిమంది భక్తులు మల్లయ్య కొండకు సందర్శించారు. పూజారి ఈశ్వరప్ప మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని అడవిపల్లెకు చెందిన ఎం.శివశంకర్‌రెడ్డి, నిర్మలా దంపతులు స్వామి వారికి పంచలోహ కాశీ ఢమరుకాన్ని వితరణగా అందజేశారు. ఆలయ ధర్మకర్త ప్రభాకర్ రెడ్డి వారిని అభినందించారు. గౌరమ్మ కుప్పలో వెలసిన గౌరమ్మ తల్లికి పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు.

హిందీ సులభమైన భాష

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా స్థాయి హిందీ ప్రతిభా పరీక్షలో ప్రతిభ కనబరిచిన పదవ తరగతి విద్యార్థులు బి.మస్తానీ, డి.నీరజ లకు ప్రోత్సాహక బహుమతులను హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే.బబిత అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందీ అంటే కష్టం అనే ఆలోచన తీరు విద్యార్థులు మార్చుకోవాలని సూచించారు. హిందీ భాష అంటే కష్టమైంది కాదని సులువైన భాషని అన్నారు. త్వరగా నేర్చుకోగల భాష ఏదైనా ఉందంటే అది హిందీ మాత్రమేనని అన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీల్లో హిందీలో 90 పైగా మార్కులు సాధించాలని విద్యార్థులను సూచించారు. ప్రతి విషయంలోనూ విద్యార్థులు అద్భుత ప్రథమ కనపరుస్తున్నారని, ఇదే ప్రతిభ గల పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో కూడా కనపరచాలన్నారు. మండల స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి మండల టాపర్స్‌గా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.నీలకంఠేశ్వర రాజు, గుర్రప్ప, ఆవుల వెంకట్, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ ఆటల పోటీలు,ఉత్తమ మార్కులు,క్రీడలతోపాటు వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుగుణ, హసీనా, నౌజియా, చాముండేశ్వరి, గౌతమీ, శ్రీదేవి, ప్రవల్లిక, పుష్ప, రేవతి, లక్ష్మీ, రెడ్డెప్ప, చాంద్‌బాషా, మహబూబ్ బాషా, శివారెడ్డి, బిలాల్, రఘు, వాసు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి

ప్రజాశక్తి-నందలూరు

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఎంఇఒ డి.గంగిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నల్లతిమ్మాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పదవతరగతి విద్యార్థులతో నిర్వహించిన చర్చాగోష్టిలో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కెరీర్‌కు పదవ తరగతి తొలిమెట్టని, అశ్రద్ధ లేకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మంచి భావి భారత పౌరులుగా ఎదిగి, కన్నవారికి, ఊరికి పేరు మంచి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టియు అధ్యక్షులు అల్లం అశోక్ కుమార్, ప్రధానోపాధ్యాయులు పెద్ద రెడ్డయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జంగశెట్టి చంద్రకుమార్, సాములునాయక్, పుష్పలత, మల్లీశ్వరి, అరుణ, చంద్రిక , ప్రశాంతిపాల్గొన్నారు.

అప్రెంటిస్ మేళాలో పది మంది ఎంపిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక శ్రీ టిఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటిఐలో సోమవారం అప్రెంటిస్ మేళా నిర్వహించారు. శ్రీ సిటీ విందాస్ కాఫీ, ప్రయివేట్ కంపెనీ ప్రతినిధి బాలకుమార్ ఐటిఐ పూర్తి చేసిన పది మందిని అప్రెంటిస్ శిక్షణ కోసం ఎంపిక చేశారు. వీరికి ఉపాధితో పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. అదేవిధంగా స్కిల్ హబ్ ద్వారా శిక్షణ పూర్తి చేసిన 27 మందికి డిఎస్‌డిఒ హరికృష్ణ, ప్రిన్సిపల్ శేషారెడ్డిలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసన్ రెడ్డి, ఇఒలు విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో ఉరుసు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించినట్లు నిర్వాహకులు షబ్బీర్ అహ్మద్, మహబూబ్‌బాషాలు తెలిపారు. శనివారం గంధోత్సవం, ఆదివారం రాత్రి ఉరుసు నిర్వహించవలసి ఉండగా అకాల వర్షాలకు ఉరుసు గంధోత్సవాలకు కొంతమేర ఆటంకం జరిగింది శనివారం రాత్రి వడగండ్ల వర్షం పడటంతో గందోత్సవం నామమాత్రంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఖవ్వాలి అందరిని ఆకట్టుకుంది.

'పాలవెల్లువ'తో అధిక ఆదాయం

రామాపురం : జగనన్న పాలవెల్లువతో పాడి రైతులకు అధిక ఆదాయం చేకూరుతుందని అమూల్ డైరీ అధికారి ఉదయ్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో సోమవారం జగనన్న పాల వెల్లువ లక్ష్యసాధన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమూల్ ప్రాజెక్టు ద్వారా పాలకు అధిక ధరలు రావడమే కాకుండా, పశువుల దాన అతి తక్కువ ధరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. పాలు కొలిచే కార్యదర్శులకు ఒక లీటరుకు ఒక రూపాయి తక్కువ కాకుండా కమిషన్ ఇస్తారని చెప్పారు. ప్రతి రైతుకు మహిళా డైరీ సహకార సంఘాలలో మెంబరుగా పరిగణింప పడుతుందని తెలిపారు. ఆరు నెలలు క్రమం తప్పకుండా పాలడైరీకి పాలు పోసిన వారికి పేమెంట్ సభ్యులుగా గుర్తింపు కల్పిస్తామన్నారు. పాలలో వెన్న శాతం పెరిగేకొద్దీ పాల ధర పెంచుతామని చెప్పారు. మహిళా డైరీ సహకార సంఘాలు జిల్లా కో-ఆపరేటివ్ అధికారులు వెలుగు అధికారులు పశుసంవర్ధక శాఖ అధికారులు ఎపి డైరీ డెవలప్మెంట్ అధికారులు, అమూల్ అధికారులు భాగస్వామ్యంతో పాలు సేకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కో-ఆపరేటివ్ అధికారి సురేష్ నిరంజన్, అర్జున్‌రెడ్డి ఎపిఎం రెడ్డమ్మ, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంటు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

అకాల వర్షంతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ తెలిపారు. సోమవారం అకాల వర్షం, వడగండ్ల దెబ్బకు పంటలు దెబ్బతిన్న రైతుల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షాలలో వడగండ్ల ధాటికి టమోటా, బొప్పాయి, వరి పంటల నష్టపోయిన రైతులు బీమా చేసుకొని ఉంటే పంటల బీమాకు అనుగుణంగా నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రైతులకు అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో రైతులు మధుసూదనారెడ్డి, నారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో 'ఫ్యామిలీ గ్లోరీ' మహోత్సవం

రాజంపేట అర్బన్ : పట్టణ పరిధిలోని భువనగిరిపల్లె ఆర్చి వద్ద గల శ్రీ చైతన్య పాఠశాలలో సోమవారం ఫ్యామిలీ గ్లోరీ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేసి పెద్దలపట్ల భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎజిఎం రమణయ్య, ప్రిన్సిపల్ బాలాజీలు మాట్లాడుతూ కుటుంబ విలువల గురించి విద్యార్థులకు వివరించారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవని, తదనుగుణంగా ఒకరి పట్ల ఒకరికి ప్రేమాభిమానాలు, ఆప్యాయతలు ఉండేవన్నారు. నేడు అన్నీ చిన్న కుటుంబాలు కావడం చేత కుటుంబ విలువల పట్ల అవగాహన లేకుండా పోతున్నారని అన్నారు. పెద్ద కుటుంబాలను ప్రోత్సహించాలని, అప్పుడే విలువలతో కూడిన సమాజం తయారవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కుటుంబరావు, అకడమిక్ డీన్ శివ శంకరయ్య, ప్రైమరీ ఇన్‌ఛార్జి శ్రీరామ్, ఉపాధ్యాయులు రాము, ఇనాయత్, షబ్బీర్, హరికృష్ణ కుమార్, వెంకటేష్, లక్ష్మీ ప్రసాద్, నరసింహులు, చిన్న రెడ్డయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి విద్యానికేతన్ వార్షికోత్సవం


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ పరిధిలోని నీరుగట్టువారిపల్లెలోని సాయివిద్యానికేతన్ 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయి విద్యానికేతన్ పాఠశాల ప్రాంగణంలో కరెస్పాండెంట్ మోడెం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎబిసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, మదనపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి,రేవతి పౌండేషన్ ఆర్గనైజర్ రామ్మూర్తి, ప్రముఖ మహిళా న్యాయవాది బాలజ్యోతి,ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ శంఖారపు

'అన్నమాచార్య' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి అధికార బలంతో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను ఫీజుల కోసం వేధిస్తోందని టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. సోమవారం స్థానిక టిఎన్‌ఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం ముఖ్యమంత్రి జగనన్న విద్యా దీవెన డబ్బులను తల్లులు ఖాతాలో వేస్తూ బటన్ నొక్కారని తెలిపారు. ఏ ఒక్క విద్యార్థికి, తల్లిదండ్రులకు డబ్బులు తమ ఖాతాలో జమ కాలేదన్నారు. అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం పూర్తి స్థాయి ఫీజును కడితేనే పరీక్ష ఫీజులు కట్టించుకుంటామని సర్కులర్ పంపించారన్నారు. ఆ సర్కులర్లో మార్చి 24వ తేదీలోపు కట్టకపోతే రూ.3 వేలు అపరాధ రుసుంతో కట్టాలని సర్కులర్ ఇవ్వడం చాలా దారుణమన్నారు. కన్వీనర్ కోటాలో చేరిన విద్యార్థులు పూర్తిగా ప్రభుత్వం ఇచ్చే రీయింబర్స్‌మెంట్ మీదే ఆధారపడి ఉంటారని తెలిపారు. వారిని రీయింబర్స్‌మెంట్ రాకుండా ఫీజులు కట్టమంటే ఏ విధంగా కడతారని ప్రశ్నించారు. కన్వీనర్ కోటాలో చేరిన విద్యార్థులు ఏ ఒక్కరు కూడా విద్యా దీవెన డబ్బులు రాకుండా కళాశాలకు డబ్బులు కట్టవలసిన అవసరం లేదన్నారు. అలా కాదని కలాశాల యాజమాన్యాలు వేధిస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులకు అనునిత్యం టిఎన్‌ఎస్‌ఎఫ్ అండగా ఉంటుందని తెలియజేశారు. కన్వీనర్ కోటాలో చేరిన విద్యార్థులను ఫీజులు కోసం వేధించొద్దని కళాశాల యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ రాజంపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి సాయి, ప్రసాద్, నాయకులు హరీష్ పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు స్వాగతం పలుకుతున్న నాయకులు

టిడిపి బలోపేతానికి కృషి చేద్దాం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి నియోజ కవర్గంలో టిడిపి జెండాను ఎగుర వేద్దామని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నాయకులు, కార్య కర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఆర్‌జె.వెంకటేష్,రెడ్డప్ప రెడ్డి, మునిరత్నం, మల్లికార్జున, రాజన్నలను కలసి పార్టీ పటిష్టతకు కృషి చేద్దామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసేది టిడిపి మాత్రమేనని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజల కోసం టిడిపి చేస్తున్న పోరాటాలకు ఆకర్షితుడినై కాంగ్రెస్‌పార్టీ నుంచి టిడిపిలో చేరానని అన్నారు. పార్టీలో వర్గ విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఉంటూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని తెలిపారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పారన్నారు. అదే ఉత్సాహంతో వచ్చే ఎన్నికల్లో కూడా టిడిపి విజయానికి కార్యకర్తలు, నాయకులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సుధాకర, రామకృష్ణ, మల్లప్ప, చంద్రాయుడు, జయన్న పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో మిట్స్ ప్రిన్సిపల్ యువరాజ్

ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కురబలకోట

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ విద్యార్థులు, అధ్యాపకులు ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులలో ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం సంయుక్తముగా నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులలో 98 మంది కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు వివిధ సబ్జెక్టు లలో జాతీయ స్థాయిలో టాపర్లుగా నిలిచారని అన్నారు. ఎన్‌పిటిఇఎల్ వారు జులై - డిసెంబర్ 2022 సమయంలో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలలో 10 సబ్జెక్టులలో జాతీయ స్థాయిలో టాప్పర్‌గా నిలిచారని అన్నారు. విద్యార్థులకు, అధ్యాపకులకు స్వయం-ఎన్‌పిటిఇఎల్ వారు సర్టిఫికెట్‌లు అందజేసినట్లు ఆయన అన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, స్వయం-ఎన్‌పిటిఇఎల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అరుళ్ కుమార్‌లు అభినందనలు తెలిపారు.

ఘన జీవామృతం తయారీపై అవగాహన

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని వైఎన్ గ్రామ పంచాయతీలో కుప్పగుట్ట హరిజనవాడ ఐసిఆర్‌పి కొండమ్మ గృహంలో ఘన జీవవామృతం తయారు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న రైతులందరికీ జీవామృతం తయారీకి ఎటువంటి పదార్థాలు కావాలలో రైతులకు వివరించారు. అందులో రెండు కిలోలు శనగ పిండి, రెండు కిలోలు బెల్లం, పుట్ట మట్టి గుప్పెడు, ఆవు మూత్రం తగినంత, ఆవు పేడ రెండువందల కిలోలు మొత్తం పదార్థాలు తీసుకుని కలిపి ఘనజీవామృతం తయారు చేసే విధానాన్ని క్షుణంగా రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఇసిఎ రామ్మోహన్, ఎంసిఎ నాగయ్య, చంద్రశేఖర్, శివారెడ్డి పాల్గొన్నారు.

దళితవాడ ప్రజల దాహార్తిని తీర్చిన 'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని బెజవాడ హరిజనవాడ గ్రామంలోని నియోజకవర్గ టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు తన సొంత నిధులతో మోటరును ఏర్పాటు చేసి దళితవాడ ప్రజల దాహార్తిని తీర్చారు. సోమవారం స్థానిక నాయకులతో కలిసి మంచినీటి బోరును ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బెజవాడ హరిజనవాడ గ్రామంలో మంచినీటి సమస్యను పలుమార్లు అధికారులు దృష్టి తీసుకువెళ్ళినా వారు స్పందించకపోవడంతో మానవతా దృక్పథంతో సొంత నిధులతో నీటిబోరును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని అన్నారు. అవినీతి,అక్రమాలకు పాల్పడుతూ ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా నీటి మోటార్‌ను ఏర్పాటు చేయడం పట్ల ప్రజల జగన్మోహన్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు భానుగోపాలరాజు, ప్రసాద్, వాసు, ఆంజనేయులు, సీతారామిరెడ్డి, అమృతనాయుడు, గంగయ్య, సుబ్బిరామ, సంజీవ, మధు, వెంకటరమణ, రెడ్డి శ్రీను, కిషోర్ పాల్గొన్నారు.



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న చమర్తి జగన్మోహన్ రాజు

క్రైం కార్నర్

ఆరుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి- కలకడ

పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. కోన పంచాయితీ పంచాయతీ తిప్పిగారిపల్లి సమీపం దక్షిణం వైపున పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం రాయడంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాటరాయలను పట్టుకుని వారి నుంచి రూ.15,770లు స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు దాడులలో కానిస్టేబుళ్లు రమేష్ ,కాంతారావు, యోగేష్ పాల్గొన్నారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కలకడ

మనస్థాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. పోలీసులవివరాల మేరకు..మండలంలోని దిగుతాండ పంచాయతీ ఎగువ తాండాకు చెందిన మూడే శంకర్ నాయక్ కుమారుడు మూడే రెడ్డినాయక్ గత కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ మద్యానికి బానిస అయ్యాడని తెలిపారు. తండ్రి మద్యం సేవించవద్దని మందలించడంతో మనస్థాపానికి గురై బ్రతుకు మీద విరక్తి చెంది క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. మృతుడి తండ్రి శంకర్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.